సాక్షి నంద్యాల

సోమవారం ; 5 ; మే ; 2025




మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళావేదికపై ఆదివారం వరంగల్‌కు చెందిన భద్రకాళి నృత్య కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్యం అలరించింది.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులు అధిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణ చేశారు.



విద్యార్థుల చూపు.. ట్రిపుల్ ఐటీ వైపు

ఇటీవలే ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉంది. సీట్లు పొందేందుకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

మల్లన్న ఆలయంలోని హుండీకి కన్నం?

- కానుకలు చోరీచేసిన నలుగురు
- ఓ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని మల్లికార్జున స్వామి గర్భగుడిలో ఉన్న హుండీకి నలుగురు మైనర్లు కన్నం వేసినట్లు సమాచారం. ఈనెల 1న ఉచిత దర్శన క్యూలైన్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన మైనర్లు గర్భగుడిలోని రత్నగర్భ గణపతి ఆలయం వద్ద ఉన్న (క్లాత్) హుండీని బ్లేడ్‌తో కోసి, అందులో కొంత డబ్బు తీస్తుండగా దేవస్థాన సూపరింటెండెంట్ పట్టుకున్నట్లు సమాచారం. వారి వద్ద నుంచి సుమారు రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పది రోజుల నుంచి నలుగురు మైనర్లు దర్శనం పేరుతో ఉచిత క్యూలైన్ల ద్వారా ఆలయంలో తరచూ తిరిగినట్లు వెల్లడైంది. ఈఓ ఆదేశాలతో దేవస్థాన సీఎస్ఓ ఫిర్యాదు మేరకు శ్రీశైలం ఒకటో పట్టణ స్టేషన్ ఆఫీసర్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. చోరీ విషయమై విధుల్లో అలసత్వం ప్రదర్శించిన సీనియర్ అసిస్టెంట్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాలుడి కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న అధికారులు

బేతంచెర్ల: స్థానిక హనుమాన్ నగర్‌కు చెందిన నాలుగేళ్ల బాలుడు షేక్ మొహిద్దీన్ ఈనెల 2న కుక్కల దాడిలో మృతిచెందిన విషయం విదితమే. బాలుడి తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డోన్ ఆర్డీఓ నరసింహులు, మండల ప్రత్యేక అధికారి బషీరున్నీసా బేగం, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మధు, తేజ పాల్గొన్నారు.

భగీరథుడిని స్మరించుకోవాలి



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల(అర్బన్): భగీరథుడిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. భగీరథ మహర్షి జయంతిని ఆదివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ భగీరథుడు వారి పూర్వ పితామహులకు స్వర్గ ప్రాప్తి కల్పించేందుకు దివి నుంచి గంగను భువికి తెచ్చేలా చేశారన్నారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా నాయకులు సురేష్‌కుమార్, శివయ్య, బాలరాజు, బాలాజీ, చిన్నయ్య, జిల్లా సంక్షేమ అధికారి ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల(న్యూటౌన్): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12.30 గంటలకు ముగించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నీట్‌కు 1,144 మంది హాజరు

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. నంద్యాలలో నాలుగు కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,176 మందికి గాను 1,144 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల ఎదుట కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అన్ని పరీక్ష కేంద్రాల ఎదుట వీల్‌చైర్‌లను అందుబాటులో ఉంచామన్నారు. పరీక్ష కేంద్రాలను ఆర్డీఓ విశ్వనాథ్, డీఎస్పీ మందా జావలి ఆల్ఫోన్స్ తమ సిబ్బందితో పర్యవేక్షించారు.

నిర్వీర్యం.. నిర్వేదం

- రైతు సేవా కేంద్రాలకు ఉరి వేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రేషనలైజేషన్ పేరుతో కొన్ని కేంద్రాల తొలగింపు
- రెండు, మూడు రోజుల్లో రానున్న ఉత్తర్వులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో 188 ఆర్‌బీకేల మనుగడ
- ఇక పోస్టుల భర్తీ, ఆర్‌బీకేల మనుగడ లేనట్లే

దేశానికే రోల్ మోడల్‌గా గుర్తింపు పొందిన రైతు భరోసా కేంద్రాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వీటిని రైతుసేవా కేంద్రాలుగా మార్చడంతో నీలినీడలు అలుముకున్నాయి. ప్రస్తుతం రేషనలైజేషన్ పేరుతో వందలాది రైతుసేవా కేంద్రాలు మనుగడ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా రేషనలైజేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది.



సేవలకు దూరంగా ఉండనున్న రైతు భరోసా కేంద్రం



ఆర్‌బీకేలో పనిచేయని డిజిటల్ కియోస్క్

కర్నూలు(అగ్రికల్చర్): రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే అన్నదాతలకు అన్ని రకాల సేవలు అందించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామస్థాయిలో రైతులకు సేవలు అందించే రైతుభరోసా కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయి. వీటిని రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారే తప్ప ఎలాంటి సేవలు అందించడం లేదు. వాటికి అన్నదాతలకు దూరం చేసేందుకు సరికొత్త ప్రణాళిక రూపొందించారు. గతంలో విత్తనం వేసే సమయం నుంచి మద్దతు ధరతో పంటను అమ్ముకునే వరకు అనేక సేవలు పొందిన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కర్షకుల కష్టం రెట్టింపు అయ్యింది.

ఎక్కడి పనులు అక్కడే!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 877 ఆర్‌బీకేలు(ఆర్ఎస్‌కేలు) ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 849, అర్బన్ ప్రాంతాల్లో 28 పనిచేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 ఆర్‌బీకేలు సేవలు అందిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో ఆర్‌బీకేలకు సొంత భవనాలు ఏర్పాటు చేసింది. కర్నూలు జిల్లాలో 328, నంద్యాల జిల్లాలో 156 ప్రకారం 484 ఆర్‌బీకేలకు అపురూపమైన సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 393 ఆర్‌బీకేలకు కూడా సొంత భవనాలు నిర్మితం అవుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

పోస్టుల భర్తీ లేనట్టే

ఆర్ఎస్‌కే పరిధిలో ఉద్యాన పంటలు ఉంటే గ్రామ ఉద్యాన సహాయకుడు(వీహెచ్‌ఏ) ఉండాలి. మల్బరీ సాగైతే గ్రామ పట్టు పరిశ్రమ సహాయకుడు(వీఎస్ఏ) పనిచేయాల్సి ఉంది. వ్యవసాయ పంటలు ఎక్కువగా ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకుడు(వీఏఏ) విధులు నిర్వర్తించాలి. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామ పట్టుపరిశ్రమ సహాయకులందరికీ పదోన్నతులు లభించాయి. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వీఏఏలు 474, వీహెచ్‌ఏలు 215 ప్రకారం మొత్తం 689 మంది పని చేస్తున్నారు. మిగిలిన 188 పోస్టులను భర్తీ చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం లేకుండా పోయింది. ఈ పోస్టులన్నీ రద్దయినట్లేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

మూతపడినట్లే!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 877 ఆర్‌బీకేలు(ఆర్ఎస్‌కేలు)ఉండగా రేషనలైజేషన్‌తో వీటిలో 188 కేంద్రాలు మూతపడినట్లే అని వ్యవసాయశాఖ వర్గాలే పేర్కొంటున్నాయి. పోస్టుల భర్తీ లేనందున ఆర్ఎస్‌కేలు కూడా లేనట్లేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఏకంగా 188 ఆర్ఎస్‌కేలు మూత పడే పరిస్థితి ఉత్పన్నం అవుతుందంటే రైతులకు సేవలు ఏ స్థాయికి దిగజారి పోతాయో ఊహించుకోవచ్చు.

2,600 ఎకరాలకు ఒక వీఏఏ/వీహెచ్ఏ!

ప్రతి 2,600 ఎకరాలకు ఒక వీఏఏ/వీహెచ్‌ఏలు ఉండే విధంగా రేషనలైజేషన్ జరుగుతోంది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఈ ప్రక్రియ జరుగుతోంది. దీనిపై వ్యవసాయ, ఉద్యాన శాఖలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. మిగిలిన భూములకు వ్యవసాయ శాఖలో ఎంపీఈవోలుగా పనిచేస్తున్న వారిని నియమిస్తారు. వీఏఏ, వీహెచ్ఏ పోస్టులను భర్తీ చేయకుండా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఎంపీఇవోలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఇవీ కష్టాలు..

- 2014నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ హయాంలో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం అవే కష్టాలు ఎదురవుతున్నాయి.
- సకాలంలో ఎరువులు, విత్తనాలు అందడం లేదు. కల్తీ విత్తనాలు విజృంభిస్తున్నాయి. గతేడాది డిసెంబర్ నెలలో నకిలీ కంది విత్తనాలతో నష్టపోయిన రైతులు పత్తికొండలో ఆందోళన చేపట్టారు. అలాగే గతేడాది ఖరీఫ్ సీజన్‌లో జూపాడుబంగ్లా, గడివేముల, మిడుతూరు మండలాల్లోని రైతులు నకిలీ విత్తనాలతో తీవ్రంగా నష్టపోయారు.
- పురుగుమందులు, ఇతరత్రా సేవలు పొందడానికి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది.
- ఆర్‌బీకేల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబందించిన సేవలను పొందడానికి కియోస్క్‌లను వినియోగిస్తారు. అయితే ఇవి నిరుపయోగంగా మారాయి.
- రైతుల నుంచి పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసే ఆర్‌బీకేలు అసలు లేవు.
- పంటలు పండకపోయినా రైతులను పలకరించే వారు కరువయ్యారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

- విత్తనం మొదలు పండించిన పంటను మద్దతు ధరతో అమ్ముకునే వరకు రైతుకు ఆర్‌బీకేలు అండగా నిలిచాయి.
- ఖరీఫ్, రబీ సీజన్లలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేసేవారు.
- వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఏపీఎంఐపీ, ఫిషరీష్, మార్కెటింగ్ తదితర శాఖలకు సంబంధించిన అన్ని రకాల కార్యాక్రమాలు ఆర్‌బీకేల ద్వారానే అమలయ్యాయి.
- ఆర్‌బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన దాదాపు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీ ఉండేది.
- ఆర్‌బీకేల్లోనే రైతుల సందేహాలను నివృత్తి చేసేవారు. ఏ ఎరువు ఎందుకు ఉపయోగపడుతుందనే దానిపై అవగాహన కల్పించేవారు.
- డిజిటల్ కియోస్క్‌ల ద్వారా తమకు అవసరమైన రైతులు ఆర్డర్ చేస్తే 48 గంటల్లోనే సరఫరా అయ్యేవి.
- ఆడియో, వీడియోలతో వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇచ్చేవారు.

రేషనలైజేషన్ జరుగుతోంది



ఉమ్మడి జిల్లా యూనిట్‌గా రేషనలైజేషన్ ప్రక్రియ జరుగుతోంది. అయితే రైతులకు ఎలాంటి నష్టం ఉండదు. ఉమ్మడి జిల్లాలో 877 ఆర్‌బీకేలు ఉన్నాయి. ప్రస్తుతం వీఏఏలు, వీహెచ్‌ఏలు కలిపి 689 మంది పనిచేస్తున్నారు. ఇందువల్ల ఆర్‌బీకేలు తగ్గే అవకాశం లేదు. వీఏఏలు, వీహెచ్‌ఏలు స్థానంలో ఎంపీఇవోలను వినియోగించుకుంటాం. రైతులకు సేవలు యథావిధిగా అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

ఆర్‌బీకేలు ఉన్నా లేనట్టే!



మాకు ఆరు ఎకరాల భూమి ఉంది. ఇందులో కంది, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్నాం. ఆర్‌బీకే మాకు అన్ని విధాలా ఉపయోగకరంగా ఉండేది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్‌బీకేలు లేనట్లుగా ఉన్నాయి. ఎలాంటి సేవలు అందడం లేదు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు కోడుమూరుకు, వెల్దుర్తికి వెళ్లాల్సి వస్తోంది. రాజకీయాలకు అతీతంగా ఆర్‌బీకేలను నిర్వహించాల్సిన అవసరం ఎంతో ఉంది.

– ఎం.మాదన్న, ఎస్‌హెచ్ ఎర్రగుడి, కృష్ణగిరి మండలం

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి



గత ఏడాది మే నెల వరకు రైతుభరోసా కేంద్రాలతో అన్ని రకాల సేవలు పొందాం. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆర్‌బీకేలు పనిచేయడం లేదు. గత ఏడాది వరకు ఎరువులు/ పురుగు మందులు ఏదీ అవసరమైనా నిమిషాల వ్యవధిలో ఆర్‌బీకే ద్వారా పొందువారం. నేడు బస్తా ఎరువు కావాలన్నా... నీళ్ల మందులు కావాలన్నా డోన్‌కు, పత్తికొండకు పోవాల్సి వస్తోంది. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– నౌనేపాటి, ముక్కెళ్ల, తుగ్గలి మండలం

కొనుగోళ్లు మూరెడు..కష్టాలు బారెడు

- జొన్న కొనుగోలు కేంద్రాలు అస్తవ్యస్తం
- సరుకు బాగోలేదంటూ వెనక్కి పంపుతున్న సిబ్బంది
- నత్తనడకన కొనుగోలు ప్రక్రియ.. రోజుల తరబడి రైతుల నిరీక్షణ
- ట్రాక్టర్ల బాడుగలు అధికమవుతున్నాయంటూ అన్నదాత ఆందోళన



గోడౌన్‌లో జొన్నలు దించుతున్న హమాలీలు

నంద్యాల(అర్బన్): కొనుగోళ్లు మూరెడు.. కష్టాలు బారెడులా తయారైంది జొన్న రైతుల పరిస్థితి. ఒక పక్క అరకొర కొనుగోలు కేంద్రాలు.. మరోపక్క సరుకు బాగోలేదంటూ వెనక్కు పంపుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల జొన్నలను మద్దతు ధర రూ.3,371తో కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా నందికొట్కూరు, ఆళ్లగడ్డ, గడివేముల, నంద్యాలలో రెండు కేంద్రాల్లో కొనుగోళ్లకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రస్తుతానికి రైల్వే స్టేషన్ సమీపంలోని సీడబ్ల్యూసీ గోడౌన్‌లో కొనుగోళ్లను చేపట్టారు. ఒకే గోడౌన్‌లో కొనుగోళ్లు జరుగుతుండటంతో జిల్లావ్యాప్తంగా వస్తున్న జొన్న పంట దిగుబడులను కొనుగోలు చేయడం సిబ్బందికి ఇబ్బందిగా మారింది. మరోవైపు రైతులు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. ఈక్రమంలో శనివారం నుంచి సెంట్రల్ వేర్‌హౌస్‌కు సరుకు తీసుకు రావద్దని, దీబగుంట్ల గోడౌన్‌కు తీసుకెళ్లాలని గోడౌన్ అధికారులు హడావుడిగా సమాచారం ఇవ్వడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడికి ఇక్కడికి తిప్పుతూ ఉంటే వాహనాల రవాణ బాడుగలు రెండింతలు భరించాల్సి వస్తుందంటూ అన్నదాతలు నిట్టూర్చారు.

నాణ్యత లేవంటూ వెనక్కి..

జొన్నలు జల్లెడ పట్టలేదని, నాణ్యత లేవంటూ సిబ్బంది కొంత మంది రైతులను వెనక్కిపంపుతున్నారు. గోడౌన్లు, సంచుల కొరత తీవ్రంగా వేధిస్తుండటం, కొనుగోళ్లు ఆలస్యమవుతుండటంతోపాటు నాణ్యత లేవంటూ వెనక్కి పంపుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇదే సమయంలో కొందరు సిఫార్స్ ఉన్న రైతుల నుంచి మాత్రమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక ట్రాక్టర్‌ను లోపలికి అనుమతించే గోడౌన్ సిబ్బందికి రూ.500, సెక్యూరిటీకి రూ.50 ఇచ్చుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో సకాలంలో కొనుగోళ్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జొన్నలను అధికారులు సకాలంలో కొనుగోలు చేసేవారు. జనవరి నుంచి ప్రారంభించి మార్చి చివరిలోపే జిల్లాలోని రైతులందరితో కొనుగోళ్లు పూర్తి చేసేవారు. మొదట కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జొన్న కొనుగోళ్లు జరిగాక.. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతుల వద్ద ఉన్న మొత్తం జొన్నల కొనుగోళ్లు జరిగేవి. గ్రామాలు, మండలాల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడమే గాకుండా మరికొన్ని ప్రాంతాల్లో కల్లాల వద్దే రైతుల నుంచి కొనుగోళ్లు జరిగేవి. కూటమి ప్రభుత్వం మాత్రం రైతన్నలను ముప్పుతిప్పలు పెడుతోంది.

బాడుగ ఖర్చు పెరుగుతోంది

రోజుకు ట్రాక్టర్ బాడుగ రోజుకు రూ.2 వేలు. వారం రోజుల క్రితం జొన్నలను విక్రయించేందుకు తెచ్చాను. ఇంకా కొనుగోలు చేయలేదు. ఎన్నిరోజులవుతుందో తెలియదు. అధికారులు రేపుమాపు అంటున్నారు. ట్రాక్టర్ బాడుగలు పెరిగిపోతున్నాయి. కేంద్రాలను మరిన్ని పెంచి త్వరగా కొనుగోలు చేయాలి.

– వెంకటేశ్వరరెడ్డి, కరిమద్దెల, గడివేముల(మం)

రోజుకు 15వేల టన్నులు కొంటున్నాం

జిల్లాకు సంబంధించి 30వేల మెట్రిక్ టన్నుల జొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇప్పటి వరకు 5వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. వరుస క్రమంలోనే కొనుగోళ్లు చేస్తున్నాం. అవినీతికి ఆస్కారమే లేదు. హమాలీలు, గోడౌన్లు, గన్నీ బ్యాగ్‌ల కొరత ఉంది. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కేంద్రాలు పెంచితే రైతులు వేచి చూడాల్సిన పని ఉండదు.

– రాజునాయక్, సివిల్ సప్లయ్ డీఎం, నంద్యాల



గోడౌన్ వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలం.. భక్తజనసంద్రం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే గాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శదర్శనం నిర్వహించుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

సమయం లేదు మిత్రమా!

- రిజిస్ట్రేషన్లలో టైమ్ స్లాట్
- బుక్ చేసుకున్న స్లాట్ సమయానికి వెళ్లకపోతే అంతే సంగతులు
- అదనంగా రూ.200 చెల్లించి మరో స్లాట్ బుక్ చేసుకోవాలి
- ఇబ్బంది పడుతున్న క్రయ, విక్రయదారులు



ఉదయం 11.30 గంటలకే కల్లూరు ఎస్ఆర్ఓలో సాయంత్రం 5.30 గంటల వరకు ఉన్న స్లాట్‌లు బుక్కైనట్లు చూపుతున్న ఆన్‌లైన్ సైట్ దృశ్యం



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన టైమ్ స్లాట్ విధానంతో క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో రోజులో ఎన్ని డాక్యుమెంట్లు అయినా రిజిస్ట్రేషన్ చేసేవారు. ఒకనొక సమయంలో సిబ్బంది రాత్రిళ్లు ఉండి నూరు డాక్యుమెంట్లకుపైగా రిజిస్ట్రేషన్లను జరిపే వారు. నూతన విధానంతో ఎస్ఆర్‌ఓల్లో (సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో) రోజుకు కేవలం 39, ఆర్ఓ కార్యాలయంలో 78 స్లాట్‌లే బుకింగ్ అవుతున్నాయి. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి దూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ పని మీద వచ్చిన వారు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

అన్‌లిమిటెడ్ నుంచి లిమిటెడ్‌కు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 22 ఎస్ఆర్ఓ, కర్నూలు, నంద్యాల ఆర్ఓ కార్యాలయాలు ఉన్నాయి. గతంలో కర్నూలు, నంద్యాల, ఆదోని, కల్లూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలాయల్లో రోజులో ఎన్ని డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లైనా జరిగేవి. ఒకనొక రోజులో 100కు పైగా డాక్యుమెంట్లు జరిగేవి. డాక్యుమెంట్ ఉంటే రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది అర్ధరాత్రి వరకు పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన టైం స్లాట్‌తో అనేక అవస్థలు ఉన్నాయి. వాటిని సరి చేయకపోతే క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడాల్సిందే. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ సంఖ్య టైమ్ స్లాట్‌తో బాగా తగ్గిపోతోంది. గతంలో అన్‌లిమిటెడ్‌గా జరిగే డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నూతన విధానంలో లిమిటెడ్‌గా మారిపోయింది. ఇప్పుడు రోజులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం(ఎస్ఆర్ఓ)లో అయితే కేవలం 39, ఆర్ఓ కార్యాలాయల్లో అయితే 78 డాక్యుమెంట్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయడానికి టైమ్ స్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ క్రమంలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇబ్బందిగా మారింది. వారు మరుసటి రోజు ఉండే టైం స్లాట్లను బుక్ చేసుకోవాల్సి వస్తోంది. ఆ రోజు కూడా ఆన్‌లైన్ సైట్ పనిచేయకపోతే వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రెండో సారి స్లాట్‌బుక్ చేసుకుంటే రూ.200 వసూలు

ఒకసారి రిజిస్ట్రేషన్ కోసం టైం స్లాట్‌ను బుక్ చేసుకుంటే కచ్చితంగా అదే సమయానికి వెళ్లాల్సి ఉంటుంది. వారికి ఇచ్చిన 10 నిమిషాల సమయంలో వెళ్లకపోతే ఆ స్లాట్ ముగిసిపోతుంది. వారు మళ్లీ స్లాట్‌ను బుక్ చేసుకోవాలంటే అదనంగా రెండో సారి అయితే రూ.200, మూడోసారి అయితే రూ.500 చెల్లించాలనే నిబంధనలు ఉన్నాయి. ఫలితంగా విక్రయదారులపై మరింత ఆర్థిక భారం పడుతుంది. ఇప్పటికే పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ రైటర్ల ఫీజు, చలానాల మొత్తాలతో వినియోగదారులపై తీవ్ర రుణ భారం పడుతోంది.

గతంలో ఎప్పుడైనా అందుబాటులో టైం స్లాట్

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో టైం స్లాట్ విధానం 2020 నుంచే వినియోగదారులకు అందుబాటులో ఉంది. గత ప్రభుత్వ హయాంలో క్రయ, విక్రయదారులే తమ డాక్యుమెంట్‌ను తయారు చేసుకొని వారికి అనువైన సమయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేలో పీడీఈ(పబ్లిక్ డేటా ఎంట్రీ) విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతనంగా టైం స్లాట్ విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించారు. గతంలో ఎప్పుడైనా టైం స్లాట్‌లు బుక్ చేసుకునే అవకాశం ఉండగా..ప్రస్తుతం వాటిని కుదించారు. దీంతో క్రయ, విక్రయదారులు ఇబ్బంది పడుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది

టైమ్‌స్లాట్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయి. వాటిని సరిచేయడానికి అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. గతంలోనూ స్లాట్‌లు అన్‌లిమిటెడ్‌గా బుక్ చేసుకునేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం లిమిటెడ్ చేయడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చి వారికి ఇబ్బంది మారింది. ప్రభుత్వం పునరాలోచనచేయాల్సిన అవసరం ఉంది.

– చంద్రశేఖర్, డాక్యుమెంట్ రైటర్

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్య


మమత మృతదేహం

బనగానపల్లె రూరల్: మండలంలోని ఫతేనగర్ గ్రామానికి చెందిన మమత (16) అనే బాలిక ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మద్దయ్య కుమార్తె మమత కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడతూ ఉండేది. వైద్యశాలల్లో చూపించిన నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది ఉదయం ఇంటి ముందు కళ్లాపు చల్లి పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి మద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ చెప్పారు.

కర్నూలులో చైన్‌స్నాచింగ్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారాం నగర్‌లో వాకింగ్ చేస్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగ(చైన్ స్నాచింగ్) తస్కరించాడు. గ్రేషి మైకెల్(65) అనే మహిళ ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పంప్ హౌస్ ప్రాంతంలో వాకింగ్ చేస్తుండగా... గుర్తు తెలియని వ్యక్తి మోటర్‌సైకిల్‌పై వచ్చి ఈమె దగ్గర ఆపి రైల్వే స్టేషన్ అడ్రస్ అడిగారు. వృద్ధ మహిళ రైల్వే స్టేషన్‌దారి చెబుతుండగా.. ఉన్నట్టుండి మెడలోని చైన్ బలంగా లాగేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన మహిళ కేకలు వేస్తూ చైన్ పట్టుకుంది. దీంతో చైన్‌లో కొంత భాగం మాత్రమే దొంగకు లభించింది. దొరికిన దాంతో దొంగ పరార్ అయ్యారు. బాధితురాలు గేషి మైకెల్ భర్తతో కలసి వెళ్లి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పదంగా కారు దగ్ధం



ఆళ్లగడ్డ: అనుమానాస్పదంగా కారు దగ్ధమైన ఘటన ఆదివారం ఆళ్లగడ్డ పట్టణ శివారులోని పెట్రోల్‌బంకు వద్ద చోటు చేసుకుంది. బీరువాలబాషా తన ఇంటి సమీపంలో కారు ఉంచారు. అయితే సమీపంలోని పొదల్లో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి కారు దగ్ధమవుతుండటంతో గమనించిన కొందరు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైందని, ఇదంతా ప్రత్యర్థుల పనేనని బీరువాల బాషా అన్నారు.

నేటి నుంచి 'సీసీఆర్‌సీ' గ్రామసభలు

కర్నూలు(అగ్రికల్చర్): కౌలుదారులకు పంట సాగు హక్కుపత్రాలు (సీసీఆర్‌సీ) ఇచ్చేందుకు ఈ నెల 5 నుంచి గ్రామసభలు నిర్వహించాలని ఏడీఏ, ఎంఏవోలను జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. కర్నూలు సబ్ డివిజన్‌లో 6,800, ఆదోని సబ్ డివిజన్‌లో 6,100, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో 4,350, పత్తికొండ సబ్ డివిజన్‌లో 4,000, ఆలూరు సబ్ డివిజన్‌లో 3,750 ప్రకారం సీసీఆర్‌సీలు జారీ చేసే విధంగా లక్ష్యాలు ఇచ్చారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది.

విద్యార్థుల చూపు.. ట్రిపుల్ ఐటీ వైపు!

- పేద విద్యార్థుల చదువుకు భరోసా
- గత ప్రభుత్వ చర్యలతో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు
- జిల్లాలో 456 ప్రభుత్వ పాఠశాలలు
- ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్సార్
- పదవ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాలుగు శాతం డిప్రివేషన్ స్కోరు
- మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ


కోవెలకుంట్ల: 2025–26 విద్యా సంవత్సరానికి రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ(ఆర్జీయూకేటీ)కళాశాలల్లో సీట్లు పొందేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత నెల 23వ తేదీన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల కాగా ఇటీవలే ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 456 ప్రభుత్వ పాఠశాలలుండగా గత నెలలో విడుదలైన పది ఫలితాల్లో 54 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాలోని ఆయా పాఠశాలల పరిధిలో 11,794 మంది బాలికలు పరీక్షలు రాయగా 9,954 మంది, 12,702 మంది బాలురకు గాను 10,097 మంది బాలురు వివిధ గ్రేడుల్లో ఉత్తీర్ణత పొందారు. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో ట్రిపుల్ ఐటీకి వెయ్యి సీట్ల చొప్పున నాలుగు వేల సీట్లను కేటాయించారు. నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా మారిన ట్రిపుల్ ఐటీల్లో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రామీణ, పేద మధ్యతరగతి వర్గాల విద్యార్థులు మక్కువ చూపుతున్నారు.

ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు

ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు గత నెల 24వ తేదీ నోటిఫికేషన్ విడుదల కాగా 27వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా జూన్ 6వ తేదీన విడుదల చేయనున్నారు. జూన్ 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. స్పెషల్ కేటగిరి(పీహెచ్‌సీ/క్యాప్/ ఎన్‌సీసీ/స్పోర్ట్స్/భారత్‌స్కాట్స్) కోటా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించనున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి అయిన అనంతరం జూలై మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభించే అవకాశం ఉంది.

ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్సార్

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్యను అందించేందుకు 2008వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఇడుపులపాయ, నూజివీడు, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోని బాసరలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఒక్కో కళాశాలకు 2 వేల సీట్లను కేటాయించగా తర్వాతి ప్రభుత్వాలు 2010 నుంచి ఒక్కో ట్రిపుల్ ఐటీలో వెయ్యి సీట్లు ఉండేలా కుదించాయి. 2014 రాష్ట్ర విభజన అనంతరం బాసర ట్రిపుల్ ఐటీ కళాశాల తెలంగాణాకు వెళ్లిపోవడంతో 2016వ సంవత్సరం నుంచి ఏపీలో ఒంగోలు, శ్రీకాకుళం ప్రాంతాల్లో ట్రిపుల్ ఐటీలను ప్రారంభించారు. వీటిలో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల విద్యార్థులకు సమానంగా సీట్లు కేటాయించాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. 4 వేల సీట్లలో ఓపెన్ కేటగిరిలో 600 సీట్లను స్థానికేతరులు, తెలంగాణ ఎన్‌ఆర్‌ఐలు, తదితరులకు కేటాయిస్తారు. మిగిలిన 3,400 సీట్లను ఉమ్మడి జిల్లాల వారికి సమానంగా పంచనున్నారు. జిల్లాకు కేటాయించే సీట్ల ఆధారంగా మెరిట్ విద్యార్థులకు అవకాశం లభించనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ఎక్కువ సీట్లు వచ్చే అవకాశముంది. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుంది. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు రుసుం రూ. 200, బీసీ, ఈడబ్ల్యూఎస్, ఓసీ విద్యార్థులు రూ. 300 చెల్లించాల్సి ఉంది.



వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం

ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేది: మే 20	ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: జూన్ 6
సర్టిఫికెట్ల పరిశీలన: జూన్ 11 నుంచి 17 వరకు	
ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు: మే 28 నుంచి 31 వరకు	
ఏపీలో ట్రిపుల్ ఐటీ కాలేజీలు: ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం	
మొత్తం సీట్లు: 4వేలు	

ఎంపిక విధానం ఇలా..

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించనున్నారు. రాష్ట్రంలోని అభ్యర్థులకు 85శాతం సీట్లు, మిగిలిన 15 శాతం సీట్లను రాష్ట్ర పునర్విభజన చట్టం 2014 ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు కేటాయిస్తారు. ఎస్సీలో 15 శాతం అనగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్–2 ప్రకారం ఎస్సీ గ్రూపు–1కు ఒక శాతం, గ్రూప్–2లో 6.5 శాతం, గ్రూప్–3లో 7.5 శాతం ప్రకారం సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన కేటగిరిలో ఎస్టీ–6. బీసీ(ఏ)7, బీసీ(బీ)10, బీసీ(సీ)1, బీసీ(డీ)7, బీసీ(ఈ)4, దివ్యాంగులకు 5 శాతం ప్రకారం సీట్లను భర్తీ చేయనున్నారు. ఆర్మీ ఉద్యోగుల పిల్లలు(సీఏపీ)–2, ఎన్‌సీసీ–1, స్పోర్ట్స్0.5, భారత్ స్కాట్స్ ఆఫ్ గైడ్స్–0.5 శాతం సీట్లను కేటాయిస్తారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కేటగిరిలో బాలికలకు 33.1/3, శాతం సీట్లను కేటాయిస్తారు. రాష్ట్రంలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ఒక్కో క్యాంపస్‌కు వెయ్యి చొప్పున మొత్తం నాలుగు వేల సీట్లు ఉన్నాయి. అదేవిధంగా ఈబీసీ కోటా కింద ఒక్కో క్యాంపస్‌కు 100 సీట్ల చొప్పున 400 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు మార్కుల ఆధారంగా అడ్మిషన్లు కల్పించనున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నాలుగు శాతం డిప్రివేషన్ స్కోరును కలిపి సీట్లను కేటాయించనుండటంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అధికంగా సీట్లు వచ్చే అస్కారం ఉంది. ఈ ఏడాది జిల్లాలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటంతో గట్టి పోటీ ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

ట్రిపుల్‌ఐటీలో సీటు వస్తుందని భావిస్తున్నా



నేను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేశాను. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలన్న తపనతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కష్టపడి 589 మార్కులు తెచ్చుకున్నాను. మా అన్న ఉసేన్‌వలి సైతం ట్రిపుల్ ఐటీలోనే బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు.
– ఉసేన్‌బాషా, పదవ తరగతి మండల టాపర్, కోవెలకుంట్ల

పది ఫలితాల్లో 578 మార్కులు వచ్చాయి



మాది మధ్యతరగతి కుటుంబం. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేశాను. గత నెలలో విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు 578 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాను. ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లను నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. – కరిష్మ, కోవెలకుంట్ల

విద్యార్థులు దరఖాస్తు చేసుకోండి



2024–25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లను దరఖాస్తులు చేసుకోవాలి. డోన్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది 119 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 6,280 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,813 మంది విద్యార్థులు వివిధ గ్రేడుల్లో ఉత్తీర్ణత సాధించారు. పాసైన విద్యార్థులు ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.
– వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ డీఈఓ, డోన్

వ్యక్తి దారుణ హత్య

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరుకు చెందిన బోయ రమేష్(25) ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. రుద్రవరం–అప్పనపల్లె దారిలో వెంగన్న మామిడి చెట్టు సమీపంలో ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రమేష్ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే ఇటీవల గుంటూరుకు మిర్చి కోతలకు వెళ్లి తిరిగి వచ్చాడు. తోటి స్నేహితుడితో కలిసి ఆటోలో రుద్రవరం వైపు వెళ్లి వెంగన్న మామిడి చెట్టు వద్ద మద్యం తాగి డిన్నర్ చేశాడు. అదే సమయంలో కొందరు వ్యక్తులు వచ్చి దాడి చేసి కత్తులతో పొడిచి హత్య చేసి పరారయ్యారు. హత్యకు కారణం పాత కక్షలే అయ్యి ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, శిరివెళ్ల సీఐ దస్తగిరి బాబు, ఎస్‌ఐ వీరయ్య యాదవ్, రుద్రవరం ఏఎస్‌ఐ రాంభూపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడున్న పెద్దకంబలూరు వాసులను అడిగి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఉంది. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


హత్యకు గురైన రమేష్


ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న సీఐ

టీడీపీ నాయకుల ఇసుక దోపిడీ


ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు

కర్నూలు(రూరల్): పంచలింగాల గ్రామ సమీపాన తుంగభద్ర నది నుంచి టీడీపీ నాయకులు యథేచ్ఛగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. రెవెన్యూ అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నది నుంచి ఇసుకను తరలిస్తే భూగర్భజాలాలు అడుగంటే ప్రమాదముందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక తవ్వకాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

ప్రమాదంలో ఆర్‌ఐకు గాయాలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో కర్నూలు అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ఆర్‌ఐగా రాజేంద్రప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. ఈయన బళ్లారి చౌరస్తా నుంచి సంతోష్‌నగర్ వైపు కారులో వెళుతూ ముందుగా ఉన్న భారీ వాహనాన్ని ఢీ కొట్టారు. దీంతో కారు దెబ్బతినింది. కారు నడుపుతున్న ఆర్‌ఐ రాజేంద్రప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

విశ్రాంత ఉద్యోగికి గాయాలు..

కర్నూలు బైపాస్ రోడ్డులోని రావూరు గార్డెన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి గాయపడ్డారు. శ్రీనివాసనాయుడు కారులో వెళ్తుండగా వెనుక నుంచి భారీ వాహనం వేగంగా తగిలింది. దీంతో కారు ఎగిరి పల్టీ కొట్టి హంద్రీ ఒడ్డున పడింది. అయితే కారు నడుపుతున్న శ్రీనివాసనాయుడు మాత్రం గాయాలతో బయటపడ్డారు.

అటవీ రక్షణ అందరి బాధ్యత

కర్నూలు కల్చరల్: అటవీ రక్షణ అందరి బాధ్యతని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీజేఎఫ్‌ఏ) కర్నూలు యూనిట్ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగర శివారులోని పుల్లయ్య పార్క్ నగర వనంలో అసోసియేషన్ మొదటి జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి అవసరమన్నారు. రాయలసీమ జోనల్ సెక్రటరీ డి. మౌలాలీ మాట్లాడారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం, ఆర్గనైజింగ్‌సెక్రటరీ రతీదేవి, జాయింట్ సెక్రటరీ కాళిదాసు, కోశాధికారి అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దహరివాణంలో సామూహిక వివాహాలు


సామూహిక వివాహాలు జరిపిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: పెద్దహరివాణం గ్రామంలో ఆదివారం 55 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. గ్రామంలో వెలిసిన శ్రీగర్జిలింగేశ్వరస్వామికి బండార మహోత్సవం నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం సామూహిక వివాహాలు నిర్వహించారు. నూతన వధూవరులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. 12 యేళ్లకు ఒకసారి బండార మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. నూతన జంటలను ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆశీర్వదించారు.

6న సెపక్‌తక్రా జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): బీచ్ సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు ఈనెల 6 వ తేదీ ఉదయం 8 గంటలకు కర్నూలు తుంగభద్ర నది తీరాన నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన సెపక్‌తక్రా క్రీడాకారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికయిన వారు ఈనెల 19 నుంచి 24 వరకు గుజరాత్ రాష్ట్రంలోని డీఐయూ ప్రాంతంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కేలో ఇండియా బీచ్ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర క్రీడా పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రసాదు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని బిజనవేములకు చెందిన ప్రసాదు సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వెళ్లాడు. తిరిగి బైక్‌పై ఇంటికి వెళుతుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రసాదుకు స్థానికులు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు రెఫర్ చేశారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

న్యాయం చేయండి సారూ..


టీడీపీ నాయకులు అక్రమంగా నిర్మాణం చేపట్టిన స్థలం

డోన్ రూరల్: టీడీపీ నాయకుల నుంచ తమ స్థలాన్ని కబ్జాకు గురికాకుండా కాపాడి న్యాయం చేయాలని ఎద్దుపెంట గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ అధికారులను వేడుకుంటున్నాడు. తన తండ్రి డి.ప్రసాద్ పేరుతో ఇంటి ముందు 1సెంట్ ఖాళీ స్థలం ఉందని విజయ్‌కుమార్ తెలిపారు. ఆ స్థలాన్ని పక్కనే ఉన్న టీడీపీ నాయకులు కేబీసీ డీలర్ పెద్దన్న, మాజీ సర్పంచ్ బి.ఈశ్వరయ్య, కేబీసీ మల్లేశ్వరయ్య ఆ ఆక్రమించడానికి యత్నిస్తున్నారన్నారు. పోలీసులకు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో కోర్టుకు వెళ్లానన్నారు. కోర్టు కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా టీడీపీ నాయకులు దౌర్జన్యంగా రచ్చకట్టపేరుతో నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

నీట్ కష్టాలు

'నీట్' రాసేందుకు వెళ్లిన విద్యార్థులు ఆదివారం పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పరుగులు తీశారు. ధరించిన బంగారు ఆభరణాలను తీయడంలో విద్యార్థినులకు కష్టాలు తప్పలేదు. పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి విద్యార్థులను పరీక్షేంద్రంలోకి పంపించారు. కర్నూలు ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్‌కు ఏడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో కర్నూలుకు చెందిన యువరాజు అనే అభ్యర్థిని అనుమతించలేదు. దీంతో ఆ విద్యార్థి పరీక్ష రాయకుండానే కన్నీటితో ఇంటికి వెళ్లాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


పరుగుతో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థి


మెటల్ డిటెక్టర్ నుంచి వచ్చిన విద్యార్థిని తనిఖీ చేస్తున్న పోలీస్



చెవి కమ్మలు తీస్తూ..


పరీక్ష కేంద్రంలోకి వెళ్లలేని విద్యార్థి